క్లుప్తంగా

ఉగాది కవితలు

మనుషులుగా మిగలాలి..



విశ్వావసు వసుధైక కుటుం
బాన్ని తీసుకొస్తోంది..
మనమే కూపస్త మండూకా
లుగా మారిపోతున్నాం..
నింగిలో చిక్కిన సునీతా
విలియంను భూమ్మీదకు
తెచ్చిన అమెరికాదేశాల మధ్య యుద్ధాలను
అరికట్టలేకపోయింది.
అన్ని మతాలకు అలవాలమైన భారత్ అందరూ
ఒక్కటేనన్న గొప్పతనాన్ని చాటలేకపోయింది..
అన్నిటా మొదలేనన్న తెలంగాణ ఉచితాలకు
చేయిచాపని సమాజాన్ని నిర్మించలేకపోయింది..
ఉగాది అంటే ఉండిపోవడం కాదు.. ఉండడం
మనుషులుగా మిగలడం.

- రాపాక శ్రీనివాస్, నెక్కొండ

పేదవాడి బాధ



ఏం పండుగో ఏమో గానీ
ఈ ఉగాది
నేనెట్ల ఎల్లదీయాలె ఈ
ఉగాది
రెక్కాడితె డొక్కాడని బక్క
బతుకు నాదయ్య
రొక్కము చేతుల లేక బిక్కుమంటున్నదయ్య
సరుకులు కొందామంటె సరసమైన ధర కాదు
సామాన్యులు కొనేటట్టు అందుబాటులో లేదు
పెట్టాలని నాకున్న పెట్టుబడి లేదయ్య
ఉట్టి మాట కాదయ్య గరిగట్టుగ నిజమయ్య
విశ్వావసు సాలు నాకు మంచిగా కలిసొత్తె
మల్లొచ్చె ఏడు నేను దర్జాగ పండుగ సేత్తా

- మంద వీరస్వామి గౌడ్, నర్సంపేట

ముందస్తు ఉగాది వేడుకలు



సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. కొన్ని చోట్ల పురోహితులు వేద మంత్రాలతో దేవతా చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేశారు.

నేడు పంచాంగ శ్రవణం

నర్సంపేట : పట్టణంలోని భూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా హిందువులందరూ ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొనడంతోపాటు పంచాంగ శ్రవణానికి హాజరు కావాలని కోరారు. తద్వారా రాశి ఫలాలు తెలుసుకుని జీవితంలో ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు.

క్రీడాకారులకు సాయం

గీసుకొండ : ఒడిశాలో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన రాష్ట్ర జట్టులోని క్రీడాకారులకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.2 లక్షల సాయం అందజేశారు. ఆయన పంపించిన నగదుతోపాటు క్రీడా దుస్తులు, షూను నాయకుడు వీరగోని రాజ్‌కుమార్, శిక్షణ ఇన్‌చార్జ్ కోట రాంబాబు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దౌడు బాబు, కోల కుమారస్వామి, నాయకులు పొగాకు భిక్షపతి, సునీల్, చిన్ని, ప్రమోద్, ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట : ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన బీసీ పోరు గర్జన కార్యక్రమ కరపత్రాలను పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జంతర్ మంతర్ వద్ద కార్యక్రమానికి బీసీలు తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీజుల సాగర్, జిల్లా కార్యదర్శి సంగెం రమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్, ప్రచార కార్యదర్శి పృథ్వీరాజ్, నాయకులు మారపాక రమేష్, పిట్టల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు

సంగెం : మండలంలోని ఎల్గూర్‌రంగంపేటలో ముదిరాజ్ కులస్తులు శనివారం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇళ్ల నుంచి బోనాలు తీసుకుని ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం పెద్దమ్మ తల్లికి నైవేద్యంగా అర్పించారు. కార్యక్రమంలో కులపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కేసు నమోదు

నల్లబెల్లి : ట్విటర్ వేదికగా నల్లబెల్లి పోలీసులపై అసత్య ప్రచారం చేసిన గుర్తు తెలియని కామన్ మెన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 27న గుర్తుతెలియని వ్యక్తి తన ట్విట్టర్ ఖాతా ఆర్86322 నల్లబెల్లి పోలీసులు దొంగలు అంటూ ద్వారా డీజీపీ, సీపీకి పోస్ట్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తిని ట్విటర్ అకౌంట్ ద్వారా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో పోస్ట్‌లు చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పెర్కవేడులో పల్లెదవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి : బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం వికాసం దిశగా పయనిస్తోందని ఆమె చెప్పారు. మండలంలోని కొండూరులో రూ.కోటితో బీటీ రోడ్డు నిర్మాణ పనులను, కేశవాపురంలో రూ.20 లక్షల అంచనాతో పల్లె దవాఖాన, పెర్కవేడులో రూ.50 లక్షలతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.20 లక్షలతో పల్లెదవాఖానా, మహబూబ్‌నగర్ గ్రామంలో మొదటి దశ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాను కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవల అందిస్తానని చెప్పారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్‌నాయక్, వివిధ శాఖల అధికారులు, బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



గీసుకొండ : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లింలు

గీసుకొండ : రంజాన్ పండుగను మత సామరస్యానికి ప్రతీకగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభివర్ణించారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ పరిధిలోని జాన్‌పాకలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. అల్లా దీవెనలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. అన్ని మతాల సారం ఒక్కటే అని చెప్పారు. ప్రజలంతా కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలగాలని సూచించారు. తొలుత ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, కొండేటి కొమురారెడ్డి, దుపాకి సంతోశ్, ఎలగొండ ప్రవీణ్‌కుమార్, సీఐ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : స్థానిక ఉస్మానియా మసీదులో తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలకు, మతాలకు సముచిత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పేదలందరికీ కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ పల్లకొండ రవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు షబ్బీర్, ఖలీల్, అన్వర్ పాషా, ఇబ్రహీం, షమీమ్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

- చైర్మన్ మురహరి రవి

నర్సంపేట : అమీనాబాద్ వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ మురహరి రవి కోరారు. చెన్నారావుపేట మండలంలోని ఆ సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన 70వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 1998లో సొసైటీలో ఎల్టీ రుణాలు తీసుకున్న రైతులకు 40 శాతం రాయితీ ఇస్తున్నామని చెప్పారు. ఆ అవకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలని కోరారు. స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులు ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. సంఘంలో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లిస్తూ సంఘం బలోపేతానికి సహకరించాలని కోరారు. సమావేశంలో సొసైటీ సీఈఓ పులి రమేశ్, వైస్ చైర్మన్ పెండ్లి మల్లయ్య, డైరెక్టర్లు మొగిలి వెంకట్‌రెడ్డి, దొంతరబోయిన కొమ్మాలు, అలువాల శాంతమ్మ, మల్లాడి వీరారెడ్డి, బండి స్వరూప, గడ్డల స్వరూప, భూక్య హుస్సేన్, మాజీ సర్పంచ్ సిద్దన రమేశ్, అమ్మ రాజేశ్, బండి హరీశ్, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : సమావేశంలో మాట్లాడుతున్న మనోజ్

సమన్వయంతోనే..

పర్వతగిరి : సమన్వయంతో పని చేస్తేనే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి చెందుతుందని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్ గౌడ్ అన్నారు. మండలంలోని కల్లెడలో శనివారం నిర్వహించిన సంఘం వార్షిక మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఉన్నతి దిశగా పాలకవర్గం ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వార్షిక నివేదికలను సమావేశంలో ప్రవేశపెట్టగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేసీటీసీ ప్రిన్సిపాల్ యాకూబ్, సంఘం సీఈఓ సురేశ్, డైరెక్టర్లు బొట్ల మరియమ్మ, జూలపల్లి గంగాధర్‌రావు, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో 'సంగెం' జయకేతనం



విజేతలకు బహుమతి అందజేస్తున్న వివేక్, తదితరులు

పర్వతగిరి : ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని కొంకపాకలో కల్చరల్ అండ్ యూత్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 20 రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో సంగెం జట్టు జయకేతనం ఎగరేసింది. ఫైనల్ మ్యాచ్‌లో కొంకపాక జట్టుతో తలపడి విజయం సాధించింది. ఈ సందర్భంగా సంగెం జట్టుకు మొదటి బహుమతిగా రూ.15 వేల నగదుతోపాటు షీల్డ్‌ను దాత రాయబారపు వివేక్ చేతుల మీదుగా అందజేశారు. రెండో బహుమతిగా రూ.10 వేల నగదుతోపాటు కొంకపాక జట్టుకు మాజీ ఎంపీటీసీ కరిమిళ్ల మోహన్‌రావు, చిట్టిమల్ల వెంకటేశ్వర్లు, కొయ్యడ రాజు, ప్రమోద్, దేవేందర్ అందజేశారు.

ఎమ్మెల్యే 'దొంతి'కి మంత్రి పదవి ఇవ్వాలి

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ



నర్సంపేట : మాట్లాడుతున్న పార్వతమ్మ

నర్సంపేట : సీనియర్ నాయకుడు, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లను మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు 40 ఏళ్లుగా మాధవరెడ్డి పార్టీకి సేవలను హైకమాండ్ గుర్తించాలని ఆకాంక్షించారు. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి సొసైటీ చైర్మన్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా, పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, టీపీసీసీ, ఏఐసీసీ సభ్యుడిగా పదవులు సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. సమావేశంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆడెపు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బుధరావుపేటలో..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మోడెం ఎల్లగౌడ్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్, మహేష్, మురళీ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పూజలు

నర్సంపేట/దుగ్గొండి : పట్టణంలోని భూనీలా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు రామానుజచార్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుగ్గొండి మండలంలోని గిర్నిబావి నుంచి కొమ్మాలకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తకొండ రవివర్మ ర్యాలీగా వెళ్లి కొమ్మాలలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ మెట్లపైకి నాయకులతో కలిసి మోకాళ్లపై నడుస్తూ మొక్కుకున్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, కార్యదర్శి వేంశెట్టి శ్రీనివాస్, గౌరవ సలహాదారు బాల్నె సర్వేశం, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత



నర్సంపేట : మాట్లాడుతున్న తహసీల్దార్ ఫణికుమార్

నర్సంపేట : పౌరహక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా చెన్నారావుపేట తహసీల్దార్ ఫణికుమార్ అభివర్ణించారు. ఆ మండలంలోని లింగగిరి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ సమానమేనని తెలిపారు. దళితుల పట్ల వివక్ష పాటిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రంలో ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, మండల వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి, పశు వైద్యాధికారి మంజీలాల్, సీహెచ్ఓ భద్రయ్య, ఏపీఓ ఈశ్వర్, గిర్దావర్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని గంగదేవితండా పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశానికి డిప్యూటీ తహసీల్దార్ పల్లకొండ రవి హాజరై మాట్లాడారు. పౌరహక్కులకు భంగం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం తండావాసులతో ప్రతిజ్ఞ చేయించి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోట శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా, ఏఈఓ అరుణ్‌కుమార్, అంబేడ్కర్ యుజన సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో దయాకర్‌రావు

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన రేవంత్‌రెడ్డి ప్రజాదర్బార్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్రఫ్, నాయకులు జలగం రవి, ఖలీల్, కస్రబోయిన కుమార్, చందు పర్వతాలు, ఐలయ్య, చెడుపాక శ్రీకాంత్, గారె అనిల్, గారె వెంకన్న, గారె రమేశ్, గుగులోతు చంద్రు, గుగులోతు వెంకటేశ్ తదితరులు మాజీ మంత్రి దయాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారికి దయాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, నాయకులు లేతాకుల రంగారెడ్డి, ఐత రాంచందర్, గారె నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, సుధాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎగ్‌కార్ట్ సెంటర్ల ప్రారంభం

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన రాజు, సంపత్, రమేశ్ ఏర్పాటు చేసుకున్న ఎగ్‌కార్ట్ సెంటర్ క్యాంటీన్‌లను ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వినీత్‌రావు శనివారం ప్రారంభించారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా ఎగ్‌కార్ట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, ఏకాంతం, రాజు, వినయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే అధ్యయనం కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సౌమ్య

నర్సంపేట : ఎరువుల తయారీ, ఇతర అంశాలపై విద్యార్థి దశలోనే అధ్యయనం చేయడం కీలకమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య తెలిపారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్/జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన 'వన్ డే సైంటిస్ట్' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎరువుల తయారీ, కంపోస్టు ఎరువుల తయారీ, రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాలు, నష్టాలను విద్యార్థులకు వివరించారు. భూసార పరీక్ష పద్ధతులు, వానపాముల పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని కూలంకషంగా అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్త సౌమ్యను ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

అంగడి వేలంలో స్పష్టత కరువు..!



వేలం నిర్వహిస్తున్న ఈఓ సదానందం

నెక్కొండ : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి (వారాంతపు సంత) వేలంలో స్పష్టత కరువైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల ఉదాసీనత, గుత్తేదారుల కుమ్మక్కుతో వాయిదాల పర్వం సాగుతోంది. నర్సంపేట డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ సమక్షంలో శనివారం వేలం నిర్వహించగా స్వల్పంగా పెరగడంతో దుబారా అయ్యాయని ఈఓ సదానందం ప్రకటించారు. నాల్గో సారి వేలంలో మేకల, గొర్రెలకు రూ.15.54 లక్షలకు, తైబజారుకు రూ.1.89 లక్షలకు గుత్తేదారులు పాట పాడారు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన (అప్‌సెట్ ప్రైజ్) కంటే తక్కువకు వేలం ఉండడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా (దుబార) వేసినట్లు ఈఓ చెప్పారు. వరుసగా నాలుగు సార్లు వేలం నిర్వహించినా అప్‌సెట్ ప్రైజ్ రాకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈఓ తెలిపారు. అధికారుల సూచనల మేరకు చర్యలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చొరవ'

వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నాగరాజు చొరవ తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, బీసీ వర్గీకరణ గురించి అసెంబ్లీలో అనేక సార్లు ఎమ్మెల్యే నాగరాజు గళమెత్తారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ, జిల్లా అభివృద్ధిని విస్మరించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎమ్మెల్యే నాగరాజు చొరవతో మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు సైతం కృషి చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు తూల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు సహకరించండి



మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

సంగెం : మండలంలోని గవిచర్లలో గుండ బ్రహ్మయ్య జాతర నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ కోరారు. గవిచర్లలో శనివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరను పార్టీలకు అతీతంగా శాంతియుతరంగా నిర్వహించుకోవాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై నరేశ్, పంచాయతీ కార్యదర్శి శరత్, ఆలయ చైర్మన్ కొంతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న గోవుల పట్టివేత

వర్ధన్నపేట : జఫర్‌ఘడ్ నుంచి వర్ధన్నపేట మీదుగా రెండు టాటా ఏస్ వాహనాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కబేళాలకు తరలిస్తున్న ఆవులు, ఎడ్లను భజరంగ్‌దళ్, ఏబీవీపీ, బీజేపీ యువ మోర్చా, విశ్వహిందు పరిషత్ నాయకులు శనివారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. చట్టాలున్నా గోవుల అక్రమ రవాణా ఆగడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, నాయకులు బోయినపల్లి దేవేందర్, వీహెచ్‌పీ జిల్లా బాధ్యుడు రాజు, గోరక్ష ప్రముఖ్ నాగరాజు, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్, నాయకులు శ్రీకాంత్, సాయికిరణ్, శ్రవణ్‌కుమార్, పెందోట మహంత్ తదితరులు పాల్గొన్నారు.

సన్నూరు మీదుగా ఆర్టీసీ బస్సు

పర్వతగిరి : పురాతన సన్నూరు వెంకటేశ్వరస్వామి ఆలయం ఉన్న సన్నూరు గ్రామం మీదుగా నడిపిస్తున్న ఆర్టీసీ బస్సును ప్రజలు వినియోగించుకోవాలని నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నర్సంపేట డిపో నుంచి బస్సు సోమారం, కొండాపురం, ఊకల్, గట్టికల్, సన్నూర్ గ్రామాల మీదుగా తొర్రూరుకు ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగిస్తుందని ఆమె పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు తొర్రూరు నుంచి రెండో ట్రిప్పు బయల్దేరి అదే దారిలో నర్సంపేటకు బస్సు చేరుకుంటుందని వివరించారు.

'యువ వికాసం'ను వినియోగించుకోండి

పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత, ఆసక్తి కలిగిన యువత ఏప్రిల్ 5 నాటికి మీసేవ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పథకం అనేక రకాల ఉపాధి పొందవచ్చని చెప్పారు. సబ్సిడీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఐనవోలు ఆలయ కమిటీ డైరెక్టర్ దారం పూర్ణచందర్, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్ధన్, నాయకులు రమేశ్, సాయికృష్ణ, సుల్తానా, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.